క్లుప్తంగా

మంత్రి రాజన్నదొరను కలిసిన ఎస్సై



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కలిసిన పాచిపెంట ఎస్సై నారాయణరావు

సాలూరు: పాచిపెంట నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నారాయణరావు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్వగృహంలో ఆదివారం ఉదయం కలిసి శాంతిభద్రతలపై చర్చించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో మరింత అంకిత భావంతో పనిచేయాల్సి ఉంటుందని ఎస్సైకి ఉప ముఖ్యమంత్రి సూచించారు.

డయల్ యువర్ డీఎం రేపు



భాస్కరరెడ్డి, డీఎం

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ కార్యాలయం వద్ద మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం భాస్కరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంస్థకు సంబంధించి సూచనలు, సలహాలు తెలియజేయడంతో పాటు సమస్యలు తెలియజేయవచ్చన్నారు. 99592 25622 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

కూరగాయల ధరలకు రెక్కలు



మార్కెట్‌లో కూరగాయలు

పార్వతీపురం: కార్తీక మాసంలో దాదాపు అధిక శాతం శాకాహారాన్ని వినియోగించడంతో కూరగాయాలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం పార్వతీపురంలోని నెహ్రూ మార్కెట్‌లో, రైతు బజార్‌లో టమాటో కిలో రూ.50, వంకాయలు రూ.50, బీరకాయలు రూ.60, చిక్కుడు కాయలు రూ.40, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.25 ధర పలుకుతున్నాయి. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి, సంగంవలస, పుట్టూరు, బాలగుడబ, నర్సిపురం తదితర గ్రామాలలో కూరగాయలను విరివిగా సాగు చేస్తున్నారు. అయితే ఆయాగ్రామాలలో కూరగాయల ధరలు కాస్త చౌకగా ఉండేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలకు చెందిన రైతులు పార్వతీపురంలో అధిక ధరలు వస్తుండడంతో కూరగాయలను పార్వతీపురం మార్కెట్‌కు తీసుకు వెళ్లి విక్రయిస్తున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగాకూడా పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయని వినియోగదారులంటున్నారు. కూరగాయలు ధరలు పెరగడంతోపాటు విరివిగా లభించకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: ఉద్యోగుల్లో స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు క్రీడలు సహకరిస్తాయని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని చిన్నమంగళాపురం వద్ద సచివాలయ ఉద్యోగుల మధ్య క్రికెట్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. మండలం, పట్టణ పరిధిలో 31 సచివాలయాల నుంచి 10 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సై బి.శివప్రసాద్, జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు నూతలపాటి భరత్‌భూషణ్ రాజు, తదితరులు మాట్లాడుతూ.. ఉద్యోగుల మధ్య ఇటువంటి పోటీల నిర్వహణతో పని ఒత్తిడిని అధిగమించడంతో పాటు వారి మధ్య సఖ్యత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్, ఎంపీడీఓ దొంక త్రినాథులు, ఉపాధ్యాయులు జి.శ్రీవాసరావు తదితరలు బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో రాయల్ స్ట్రైకర్స్, బ్లాక్ పాంథర్స్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి.

మార్మోగిన రామ నామస్మరణ

పాలకొండ: సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం హిందూ ధర్మ ప్రచార యాత్ర నిర్వహించారు. వందలాది మంది రామభక్తులు పూర్ణకలశాలతో ఈ యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని ఆచరించాలని, ధర్మ రక్షణకు కృషిచేయాలని కోరారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. హిందు ధర్మ ప్రచార కర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా నూతన భవనాలు



గెడ్డలుప్పిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం



గెడ్డలుప్పిలో పూర్తికావచ్చిన విలేజ్ హెల్త్ క్లినిక్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే ప్రజలకు సేవలందించడానికి కోట్లాది రూపాయలతో గ్రామాల్లో జరుగుతున్న సచివాలయాలు, వెల్‌నెస్, రైతు భరోసా, లైబ్రరీ భవనాల నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో 21 సచివాలయాలు, 20 ఆర్బీకే, వెల్‌నెస్ భవనాలు ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించడానికి అనుగుణంగా ఒక్కో భవనం రూ.42 లక్షలతో మౌలిక సదుపాయాలతో సచివాలయ భవనం, రూ.21 లక్షల వ్యయంతో రైతు భరోసా భవనం, రూ.22 లక్షలతో విలేజ్ (వెల్‌నెస్)హెల్త్ క్లినిక్ భవనం నిర్మించాలని సంకల్పించారు. ఈ మేరకు పెదభోగిలి-1,పెదభోగిలి-2, పెదంకలాం, వెంకటాపురం, నిడగల్లు, కాశీపేట, సీతానగరం, గాదెలవలస, తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, సూరంపేట, గుచ్చిమి, జానుమల్లువలస, జోగింపేట, చినభోగిలి, బూర్జ అంటిపేట గ్రామాల్లో భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. సచివాలయ ఉద్యోగులు అద్దె కార్యాలయాల్లో అసౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం ప్రారంభించేంత వరకూ ఇబ్బందులతోనే విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా నిర్వాహకులు పనులను వేగవంతం చేయడానికి చర్యలు చేపట్టారు.

ప్రజలకు అందుతున్న సేవలు

ఈ క్రమంలో గెడ్డలుప్పిలో సచివాలయ, గ్రామీణ ఆరోగ్యకేంద్ర భవనాలు ప్రారంభించడానికి సిద్ధం చేయగా రైతు భరోసా భవనం నిర్మించాల్సిన స్థలంలో విద్యుత్ స్తంభం ఉన్నందున పనులు జరగలేదు. ఇప్పటికే కాశీపేట, గాదెలవలస గ్రామాల్లో సచివాలయ భవనాలు ప్రారంభించారు. పెదభోగిలి-1,పెదభోగిలి-2, తామరఖండి, నిడగల్లు సచివాలయ భవనాలు పూర్తి కావడంతో ప్రారంభించడానికి గ్రామపెద్దలు సిద్ధం చేశారు. అలాగే గుచ్చిమి, నిడగల్లు గ్రామాల్లో విలేజ్ క్లినిక్ పనులు పూర్తి కావచ్చాయి. ఆర్ వెంకంపేట సచివాలయం పరిధిలోని రామవరంలో నిర్మించిన రైతుభరోసా భవనం, ఆర్.వెంకంపేటలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించడంతో రోగులు, రైతులకు సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

సిద్ధమైన సచివాలయ భవనాలు



మండలంలో సచివాలయ భవనాల నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. సచివాలయ మహిళాఉద్యోగులు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు భవనాల నిర్మాణం వేగవంతం చేయడానికి అవసరమైన వసతులు కల్పించడంతో పనులు పూర్తి కావచ్చాయి. సచివాలయ ఉద్యోగులు సొంత భవనాల్లోనే విధులు నిర్వహించడానికి చర్యలు చేపట్టాం.

ఎంఎల్ఎస్ ప్రసాద్, ఎంపీడీఓ, సీతానగరం

ఇళ్ల పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయండి



పెదమేడపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కోరిన పెదమేడపల్లి ప్రజలు

సాలూరు: తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించి, న్యాయం చేయాలని మెంటాడ మండలం పెదమేడపల్లి ప్రజలు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరను కోరారు. పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఒక్కో ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులతో మాట్లాడి అర్హులందరికీ స్థలాలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పీహెచ్‌సీలో ఉచితనేత్ర వైద్యశిబిరం

- 60 మందికి కంటి పరీక్షలు



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సీహెచ్ఓ ఎస్వీ రమణ

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అంధత్వ నివారణకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, కంటి వ్యాధిగ్రస్తులు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ (సీహెచ్ఓ) ఆఫీసర్ ఎస్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ నేత్రవైద్యులతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించిన సమయంలో వివిధ కారణాల వల్ల హాజరుకాని, శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినా ఇంతవరకూ ఆస్పత్రులకు హాజరుకాని వారికోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు 60 మందికి కంటిపరీక్షలు నిర్వహించి నలుగురికి శస్త్రచికిత్స అవసరమైనప్పటికీ వారికి మధుమేహం ఉన్నందున వ్యాధి తగ్గేందుకు మందులు అందజేసినట్లు చెప్పారు. త్వరలో వారికి శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 28 మందికి శస్త్ర చికిత్స చేయడానికి బస్సులో విజయనగరం తరలించామన్నారు. మరో 28 మందికి కంటిఅద్దాలు, చుక్కల మందులు అవసరమని గుర్తించినట్లు తెలియ జేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, శంకర్‌ఫౌండేషన్ కోఆర్డినేటర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రాధాన్యం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అభివృద్ధికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం పట్టణంలోని 17వ వార్డు పరిధిలోగల బంగారమ్మ కాలనీలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు ప్రజలు సీసీ రోడ్లను నిర్మాణం చేపట్టాలని వినతి అందించారు. ఈ మేరకు బంగారమ్మ కాలనీలో నిర్మాణం చేపట్టిన పలు సీసీ రోడ్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో రోడ్డుకు ఇరువైపులా అవసరమైన సీసీ కాలువలను నిర్మించాలని మున్సిపల్ ఏఈని ఆదేశించడంతో పాటు సీసీ కాలువల పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వార్డు ప్రజల సౌకర్యార్థం అన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గోళ్ల పద్మ, వెంకటరమణ, సచివాలయం కన్వీనర్లు మరడాన తవిటి నాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

పట్టణంలోని 4వ వార్డుకు చెందిన పంటల శ్రీనివాస్ అనారోగ్య అత్యవసర పరిస్థితుల్లో నడుముకు శస్త్ర చికిత్స చేసుకుని ఆర్థికంగా చితికిపోయింది. దీంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు.

నలుగురు పేదలకు ఇళ్ల పట్టాల అందజేత

'నా అడుగు మీకోసం' కార్యక్రమం ద్వారా ఇటీవల పార్వతీపురం పురపాలక సంఘంలోని 4వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావును నాలుగు కుటుంబాల వారు ఇళ్ల పట్టాలు కావాలని కోరారు. ఈ మేరకు ఆనాడు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఆదివారం ఆ వార్డుకు వెళ్లి ఇళ్ల నివాస పట్టాలను ఎమ్మెల్యే జోగారావు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యకు పరిష్కారం చూపిన ప్రభుత్వంపై విశ్వాసం చూపి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని దీవించి మళ్లీ సీఎంగా గెలిపించి తీరాలని కోరారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఏపీ చరిత్రలోనే తొలిసారి క్రీడా సంబరాలు

ఏపీ చరిత్రలోనే తొలిసారి క్రీడా సంబరాలు జరపాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. 15 ఏళ్ల పైబడిన వారు అందరూ పాల్గొనవచ్చని, యువతలోని టాలెంట్‌ను గుర్తించేందుకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో పెద్ద ఎత్తున క్రీడా పోటీలు నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు. అన్ని ఏర్పాట్లు జిల్లా అధికార యంత్రాగం ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. యువత ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీని వీడిన వారందరికీ భవిష్యత్..

- మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు:

టీడీపీని వీడిన వారందరికీ భవిష్యత్ బాగుందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీని వీడిన కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు ముఖ్యమంత్రులయ్యారన్నారు. అలాగే సీతక్క, రోజా, కొడాలి నాని, విడదల రజినీలు మంత్రులయ్యారని చెప్పారు. ఇకనైనా టీడీపీ నాయకులు వాస్తవాలను గ్రహించాలని సూచించారు. 2019లో ప్రజలు కూడా టీడీపీని వీడడంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నాయకులు మళ్లీ మోసపూరిత హామీలతో ముందుకు వస్తున్నారని, అటువంటి వారికి గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు.

జగనన్న హయాంలో స్వర్ణయుగం



వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు నాలుగున్నరేళ్లుగా స్వర్ణయుగం చూస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ, వాస్తవాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూచించారు.

రెగ్యులర్ చేయండి..

షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కొండగొర్రి ఉదయ్‌కుమార్, నారాయణరావు, రామారావు, తదితరులు కోరారు. ఈ మేరకు మంత్రి రాజన్నదొరను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఫిష్ ఆంధ్రా ద్వారా ఆరోగ్యవంతమైన చేపలు

- డైలీ షాపు ఏర్పాటుకు 60 శాతం రాయితీ
- ఎ.డి తిరుపతయ్య

సీతానగరం: ప్రజలకు ఆరోగ్యవంతమైన చేపలను విక్రయించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా-ఫిట్ ఆంధ్రా డైలీలు దోహద పడతాయని మత్స్య శాఖ ఎ.డి వేముల తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని బూర్జలో గల వెంకటేశ్వర మత్స్య సహకారసంఘం అధ్యక్షుడు కె.సింహాచలం ఆధ్వర్యంలో రూ. 10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా డైలీషాపును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పీఎంఎంవై పథకం ద్వారా ఫిష్ ఆంధ్రా-ఫిట్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తి దారులైన నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందడానిని 60 శాతం రాయితీపై మినీ యూనిట్లు ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇచ్చిందన్నారు. స్వయం ఉపాధి పొందడానికి ఉత్సాహం చూపిన వారికి లబ్దిదారుని వాటా 40 శాతం నిధులకు బ్యాంక్ రుణ సదుపాయం కల్పించి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 70 ఫిష్‌ఆంధ్రా-ఫిట్‌ఆంధ్రా మినీ డైలీ షాపుల ద్వారా విక్రయ కేంద్రాల్లో వివిధ రకాల చేపల విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. ఫిష్ ఆంధ్రా- ఫిట్ ఆంధ్రా డైలీ షాపులను ఆయాగ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని, వ్యాపారస్తులను ప్రోత్సహించాలని కోరారు.



బూర్జ ఫిష్ ఆంధ్రా డైలీషాపులో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ ఎ.డి వేముల తిరుపతయ్య

జీవాల్లో కాలిపుండ్లతో జాగ్రత్త

- డిసెంబరు, జనవరి నెలల్లో వ్యాధి వ్యాప్తి
- వ్యాధి లక్షణాలపై పెంపకందారులకు అవగాహన తప్పనిసరి
- పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు

గుమ్మలక్ష్మీపురం:

గొర్రెలు, మేకలకు సోకే సీజనల్ వ్యాధులపట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలలో జీవాలకు కాలి పుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంది. చిత్తడి నెలల్లో ఎక్కువగా తిరిగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గిట్టల పుండ్లు, బురద పుండ్లు, మితువకాళ్లు, పోడాళ్లు, తదితర పేర్లతో కూడా పిలుస్తారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే జీవాల ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు పలు సూచనలు చేశారు.

వ్యాధి లక్షణాలు..

కాలి గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి, చిట్లిపోయినట్లు ఉంటుంది. చీము పట్టి, నొప్పితో గొర్రెలు, మేకలు నడవలేక ముందు కాళ్లపై గెంతుతుంటాయి. వ్యాధి తీవ్రమైతే గిట్టలు ఊడిపోతాయి.

వ్యాధి నిర్ధారణ..

గిట్టల మధ్య చర్మం ఎర్రగా మరుతుంది. తర్వాత గిట్టల మధ్య వాపు వస్తుంది. పుండు పెద్దదై చీము పట్టి చెడు వాసన వస్తుంది. గిట్టలకు వ్యాధి సోకి కొన్ని సమయాల్లో గిట్టలు ఊడిపోతాయి.

వ్యాప్తి..

ఈ వ్యాధి స్ఫ్రోఫోరస్ నోడోసిస్, వుసిబాక్టీరియం నెక్రోఫోరిస్ అనే బాక్టీరియా ద్వారా వస్తుంది. బురద నెలల్లో జీవాలు తిరిగినప్పుడు అందులోని బ్యాక్టీరియా బురదతో పాటు గిట్టల మధ్య చేరడంతో ఈ వ్యాధి సోకుంది. వ్యాధి సోకిన గొర్రెల గిట్టలు ఇతర గొర్రెలకు తాకడం వల్ల, వ్యాధి సోకిన జీవాలు ఉండే ప్రదేశాలలో వేరొక గొర్రెల మందలు తిరుగటం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

నివారణ..

జీవాల్ని చిత్తడి నెలల్లో ఎక్కువ సేపు తిరగనివ్వరాదు. పొడిగా ఉండే ప్రదేశాల్లో మేపాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. సిమెంట్ ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి అందులోకి 8 శాతం పోటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా 5 శాతం ఫార్మలిన్ ద్రావణం పోసి అందులో నుంచి జీవాల్ని ప్రతి రోజు 3-5 నిమిషాలు నడిపించాలి. అలాగే వ్యాధి సోకిన గొర్రెలు, మేకలు ఉండే మంద నుంచి జీవాలను కొనుగోలు చేయరాదు. వ్యాధి సోకిన వాటిని వేరే ప్రదేశాలకు లారీలు, ట్రాక్టర్లలో గాని రవాణా చేయరాదు.

చికిత్స..

వ్యాధి సోకిన కాళ్లను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో 5 నిమిషాలు ముంచాలి. తర్వాత లోరాక్సెన్ అనే యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, వరుసరగా 3-5 రోజులు వేయించాలి. కాళ్ల నొప్పులు తగ్గడానికి జోబిడ్ ఇంజెక్షన్లు వరుసగా 3-5 రోజులు వేయించాలి.



మేతకు వెళ్తున్న గొర్రెలు

